www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024





## మహిళలకు రక్షణగా వన్ స్టాప్ సెంటర్

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

మహిళలకు రక్షణగా, ఆపన్న హస్తంగా వన్ స్టాప్ సెంటర్ నిలుస్తుందని సఖీ రాష్ట్ర కార్యాలయ సిబ్బంది విజయ శ్రీ అన్నారు. గురువారం ఎస్ఎన్ కాలనీలోని వన్ స్టాప్ సెంటర్ (సఖి)ను పీడీ శశికళతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు, భర్త వేధింపులు, కుటుంబ కలహాలు ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వన్ స్టాప్ సెంటర్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. వన్ స్టాప్ సెంటర్ నిర్వహణ రాష్ట్రంలోనే మంచిగా నిర్వహిస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వివేక్, సూపర్డెంట్ లక్ష్మీదేవి, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.



వన్‌స్టాప్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న విజయశ్రీ

# కార్మికుల హక్కుల కోసం పోరాటాలు

### సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

కార్మిక హక్కుల కోసం పోరాడాలని, మతం మతాన్ని వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. సిఐటియు 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పట్టణంలోని క్యాంపస్ స్కూలు ఎదురుగా సీనియర్ కార్మిక నాయకులు, సిఐటియు మండల ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య అధ్యక్షతన జెండా ఎగురవేశారు. పదేళ్లుగా మోడీ ప్రభుత్వం కార్మికులకు ఉన్న ప్రాథమిక హక్కులైన 44 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు యాజమాన్యాలకు అనుకూలంగా తీసుకువచ్చిందని విమర్శించారు. రైతులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా మూడు నల్ల చట్టాలను బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తే కార్మికులు, రైతులు ఏకమై నల్లచట్టాలను రద్దు చేసేంతవరకు పోరాడామని గుర్తుచేశారు. రాష్ట్రంలో 15 ఏళ్లుగా షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాలు సవరణ చేయడం మానేశారని తెలిపారు. ప్రతిరోజు నిత్యావసరాల ధరలు పెరుగుదలతో కార్మికుల నిజవేతనాలు అధమ స్థాయికి పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల వీరోచిత పోరాటాన్ని గుర్తు చేశారు. పోరాడిన కార్మికులు, మున్సిపల్, పంచాయతీ, ఎపిఎండిసి, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు పోరాడే వేతనాలు పెంచుకున్నారన్నారు. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా, అంగన్వావాడీ, ఆశ, ఆనిమేటర్స్ స్కీం వర్కర్లను, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేంత వరకు, అసంఘటితరంగ కార్మికులైన ఆటో, హమాలి, భవన నిర్మాణ, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేంత వరకు అలుపెరగని పోరాటాలకు కార్మికవర్గం సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని కాపాడుకొని, కుల తత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిఎండిసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నారదాసు సుబ్బరాయుడు, మంగంపేట మైనింగ్ వర్కర్స్ త్రివేణి ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, ఆర్గనైజేషన్ సెక్రటరీ రాజశేఖర్, విఆర్ఎ గ్రామ సేవకుల సంఘం కార్యదర్శి లక్ష్మీకర్, బలరాం, నాగరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, నాయకులు సి.వేణు, ఎం.సుబ్బరాయుడు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మద్దెల ప్రసాద్, నందకుమార్, సిఐటియు మండల సహాయ కార్యదర్శి ఆనిమేటర్ సంఘం, నగరిపాటి ఆనంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, పి.జాన్ ప్రసాద్, ఎపిఎండిసి, పోరాట కమిటీ, కోశాధికారి, హరి ప్రసాద్, శ్రీను, కెవిపిఎస్ నాయకులు హరి పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో సిఐటియు శ్రేణులు పతకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తూ ఉందని చెప్పారు. ఉద్యోగులు, కార్మికులు అంగనవాడీ, ఆశా మున్సిపల్ విద్యుత్ గ్రామ సేవకులు గ్రామ పంచాయతీ, కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడంతో పాటు పెట్టుబడి దారి వ్యవస్థను కూల్చి కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేయడమే సిఐటియు అంతిమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వి.రమణ, జిల్లా కమిటీ సభ్యులు ఫయాజ్, హమాలీ సంఘం నాయకులు మాధవయ్య, మున్సిపల్ నాయకులు వై.వెంకటరమణ, బి.వి.రమణ, తోపుడు బండ్ల సంఘం నాయకులు చంద్ర, శంకర, పద్మ, సలీం పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడటమే సిఐటియు నినాదమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద జెండా ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యదర్శి విజయలక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, ప్రసాద్, రమణ, ఆటో యూనియన్ నాయకులు నందకిషోర్, సుదర్శన్, రాజు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు : నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు



రాజంపేట : జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు



రాయచోటి : జెండా ఎగురవేస్తున్న సిఐటియు నాయకులు

# ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- 1.63 లక్షల ఎకరాల్లో ప్రణాళిక
- 55 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనం సిద్ధం
- 38 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు
- విత్తన పంపిణీకి ఏర్పాట్లు



**ప్రజాశక్తి-రాయచోటి/రాయచోటి టౌన్**

ఈ ఏడాది మొలకల పౌర్ణమికి ముందే తొలకరి ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాలలో ఇప్పటికే తొలకరి వర్షాలు కురుశాయి. జిల్లాలోని రైతాంగం అంతా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఆ దిశగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కూడా విత్తనాల పంపిణీ కోసం ఏర్పాట్లను చేపడుతున్నారు. జిల్లాలోని విత్తన పుకాయల కోసం రైతు భరోసా కేంద్రాలలో రైతుల రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. విత్తనాలు కూడా జిల్లాలో రైతుల డిమాండ్‌ను బట్టి వేరుశనగ విత్తనం కాయలను సరఫరా చేసేందుకు ఎపి సీడ్స్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ 15వ తేదీ నుంచి జూలై 15వ తేదీ వరకు నెల రోజులు పాటు ఉంటుంది. గత ఏడాది సరైన వర్షపాతం లేక నష్టపోయిన రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రాక మునుపే తొలకరి వర్షాలు కురుస్తుండడంతో రైతన్నలు ఇప్పటికే తమ భూములను దుక్కులు దున్ని ఖరీఫ్ సాగు కోసం సన్నద్ధం అవుతున్నారు. వర్షాలతో పాటు రుతుపవనాలు కూడా ఈ ఏడాది ఆశించిన స్థాయిలో ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు కూడా ప్రకటించడంతో పాటు వాతావరణం అనుకూలిస్తుండడంతో జిల్లాలోని రైతాంగం ఖరీఫ్ సాగుపై ఆశలు పెంచుకుంటున్నారు.

**జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో సాగు**

జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యంగా అధికారులు నిర్దేశించుకున్నారు. ఈ ఏడాది వేరుశనగ పంట పూర్తి స్థాయిలో సాగులోకి వచ్చే ఆవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.07 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వరి పంట కూడా 25 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ఈ పంటలే కాక రైతులు కంది పంటను వేరుశనగలో అంతరపంటగా సాగు చేస్తారు. ప్రధాన పంటలుగా వేరుశనగ, వరి, కంది అధిక విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంది. ఉలవ, అలసందలు, అనుములు, సజ్జలు, మొక్కజొన్న వంటివి సాగు చేసుకోనే అవకాశం ఉంది. ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం బాగా పెరిగే ఆవకాశం ఉంది. ప్రభుత్వం ఇప్పటికే 55 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు చేసింది. రైతు భరోసా కేంద్రాల్లో రైతుల రిజిస్ట్రేషన్, విత్తనాలు పంపిన కూడా ప్రారంభించారు. జిల్లాలోని 400 రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో అధికంగా ఉద్యావన పంటలు సాగులో ఉన్నందున ఏడు మండలాలు మినహాయిస్తే మిగిలిన 23 మండలాల్లో వేరుశనగ సాగు చేయడానికి ఇప్పటికే రైతులు పొలాలను దుక్కులు దున్ని పంటల సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు సరఫరా చేయనుంది. పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట ఎరువుల కోసం జిల్లాకు ఆరు వేల క్వింటాళ్ల విత్తనాలు సరఫరా అయ్యాయి. వీటిని 50 శాతం సబ్సిడీతో రైతాంగానికి అందించే వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇప్పటికే అధికారులు పచ్చిరొట్ట ఎరువులు రిజిస్ట్రేషన్ ప్రారంభించి విత్తనాలను పంపిణీ చేయబోతున్నారు. ప్రధానంగా జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో 90 శాతం, మిగిలిన ప్రాంతాల్లో 10 శాతం వరకు వరి పంటను సాగు చేస్తున్న రైతాంగానికి పచ్చిరొట్ట ఎరువుల తయారీ కోసం అవసరమైన విత్తనాలను 50 సబ్సిడీతో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఇవ్వనుంది. నెలాఖరులోగా జిల్లాలో వేరుశనగ విత్తన పంపిణీ చేపట్టేందుకు అధికారులు సన్నదమవుతున్నారు. ఈ క్రమంలోనే విత్తనాల కోసం రైతులకు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ కోసం అవకాశం కల్పిస్తున్నారు. ఖరీఫ్ కోసం 38 వేల మెట్రిక్ టన్నులు, రబీలో 30 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేసేందుకు అధికారులకు ఏర్పాటు చేశారు. ఈ ఎరువులను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు మొదటి ప్రాధాన్యతగా, సొసైటీలకు రెండో ప్రాధాన్యతగా, ప్రవేటు డీలర్లకు మూడో ప్రాధాన్యతనిస్తోంది. జిల్లాకు వచ్చే ఎరువుల్లో 20 వేల మెట్రిక్ టన్నులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించబోతున్నారు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు వేరుశనగ విత్తనం సాగుకు మంచి అదను కావడంతో జిల్లాల్లో జూలై చివరి వరకు వేరుశనగ పంట సాగు చేసే అందుకు రైతులు సంసిద్ధమవుతున్నారు .

**ప్రతి రైతుకు విత్తనాలు, ఎరువులను అందిస్తాం**

ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటను సాగు చేయాలనుకునే రైతులు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు విత్తనాలు అందజేస్తాం. రిజిస్ట్రేషన్‌లను బట్టి రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు, ఎరువులు సరఫరా, పురుగుల మందులు ఇస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 18 మండలాలను కరువు మండలాలుగా గుర్తించి రూ.25 కోట్లు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం సాయం అందించిందన్నాం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే తొలకరి పలకరించడంతో వర్షాలు అనుకూలించే పరిస్థితులు ఉన్నాయి.

**- బి.చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి.**





మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి

## ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన అవసరం

### - ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి

**ప్రజాశక్తి -రాయచోటి**

ఓట్ల లెక్కింపుపై కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాయచోటి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఓట్ల లెక్కింపుపై (మాక్ కౌంటింగ్ శిక్షణ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు మొదలవుతుందని, తర్వాత ఇవిఎం ఓట్ల లెక్కింపును ప్రారంభించాలన్నారు. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఓట్ల లెక్కింపునకు రాజంపేట పార్లమెంట్, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 12 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశారన్నాఉ. కౌంటింగ్ సిబ్బంది అందరూ ఉదయం 5 గంటలకే లెక్కింపు కేంద్రాలకు చేరుకొని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో కౌంటింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా, ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది కానీ, ఏజెంట్లు కానీ, ఇతర అధికారులు కానీ ప్రతీఒక్కరూ తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రతి టేబుల్‌కు ఒక ఎఆర్ఒ, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. ఇవిఎం కౌంటింగ్ నిమిత్తం ప్రతి టేబుల్‌కు ముగ్గురు సిబ్బంది ఉంటారని ఇందులో ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, ఇసి నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు లెక్కించాలన్నారు. శిక్షణ సమయంలో అన్ని అంశాలపై కౌంటింగ్ సిబ్బంది క్షుణ్ణంగా అవగాహన తెచ్చుకోవాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. కౌంటింగ్‌లో ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా ప్రశాంతవాతారణంలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారులు డిపిఒ ధనలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ నరసింహ కుమార్, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - కడప**

ప్రభుత్వ అంధ బాలుర వసతి గృహం శంకరాపురం కడప, ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతిగృహం కడపలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు, ఆపై తరగతులు చదువుతున్న 100 మంది బాలురు, 50 మంది బాలికలు వివిధ కేటగిరి( అందులు, బధిరులు, శారీరక విభిన్న ప్రతిభావంతులు) విద్యార్థులకు ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఆర్. వి. కృష్ణ కిషోర్ తెలిపారు. వసతి గృహాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహార భోజనం, కాస్మెటిక్స్, నాలుగు జతల బట్టలు, ప్లేటు, గ్లాసు, ట్రంకు పెట్టె మొదలైనవి అన్ని ఉచితంగా ఇస్తారన్నారు. వసతి గృహాల్లో ప్రవేశం కోసం విభిన్న ప్రతిభావంత బాలురు వార్డెన్ నంబర్ 7396412434, విభిన్న ప్రతిభావంత బాలికల మాట్రన్ కం స్టాఫ్ నర్స్ నంబర్లకు 6302512485 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

## ప్రజాశక్తి లింగాల విలేకరి నాగరాజు మృతి

**ప్రజాశక్తి-పులివెందుల టౌన్**



వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల ప్రజాశక్తి విలేకరి నాగరాజు (45) అనారోగ్యంతో గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. కొంత కాలంగా గుండెపోటు సమస్యతో ఆయన బాధపడుతూ ఉండేవాడు. ఇటీవలే ఆయన గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. గురువారం ఉదయం ఆరోగ్య సమస్యతో అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తీసుకెల్లారు. అక్కడ మళ్లీ గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. నాగరాజుకు భార్య నాగమునెమ్మ, కూతురు, కొడుకు ఉన్నారు. కూతురుకు వివాహం చేశారు. కొడుకు వెంకటప్రసాద్ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అప్పులు చేసి వైద్యం చేయించినా హఠాత్తుగా నాగరాజు మరణించడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయంది. శుక్రవారం లింగాలలో నాగరాజు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగరాజు 15 ఏళు నుంచి వివిధ పత్రికల్లో పని చేశారు. ప్రస్తుతం ఏడాదిగా ప్రజాశక్తి లింగాల విలేకరిగా పనిచేస్తున్నారు. ప్రజాశక్తి విలేకరి నాగరాజు మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, వైఎస్ఆర్ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు, సిబ్బంది సంతాపం తెలిపారు. నాగరాజు కుటుంబ సభ్యులకు పలువురు ప్రముఖులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## 'మిట్స్'లో మై భారత్ పోర్టల్‌పై శిక్షణ

**ప్రజాశక్తి-మదనపల్లి**

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్) వారు మై భారత్ పోర్టల్, డిజిటల్ లిటరసీపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, క్రీడలు సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. హాండ్స్ ఆన్ ట్రేనింగ్‌ను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెండు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. యువతకు మై భారత్ పోర్టల్‌లో ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలో నేర్పుతారని చెప్పారు. మేరా యువ భారత్ పోర్టల్ ఈ ఏడాది జనవరి చివరి నాటికి 1.45 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్‌లతో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్ కారణంగా రిజిస్ట్రేషన్‌ను కొన్ని నిమిషాల్లోనే పూర్తి చేయడానికి అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. నిర్మాణాత్మక, పరివర్తనాత్మక ప్రయత్నాల వైపు దేశ యువతను సమీకరించడంలో పోర్టల్ ఇప్పటికే ప్రభావం చూపుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా, డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్, రాష్ట్రంలోని వివిధ కలశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ రామనాథన్

# ఇష్టారాజ్యంగా ప్రయివేటు స్కూళ్ల దోపిడీ




నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

సిబిఎస్ఇ, ఐఐటి, ఒలంపియాడ్ పేరుతో ప్రయివేటు పాఠశాలలు విద్యార్థులను వంచిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర అన్నారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రయివేటు పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చుకొని పాఠ్యపుస్తకాల పేరుతో వేలకు వేలు దోచుకుని, నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. పట్టణంలోని శిరిడి సాయి, రెయిన్‌బో, బిఎస్‌సి ప్రైమరీ స్కూల్, కింగ్ బ్రిడ్జ్, విబి స్కూల్, ఐడిల్ స్కూల్, ఫ్యూచర్ మైండ్ పాఠశాలలు వసతి గృహాలను పాఠశాలలుగా మలచుకుని, కనీస వసతులు కల్పించకుండా సిబిఎస్ఇ, ఐఐటి, ఒలంపియాడ్ పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. జీసస్ హైస్కూల్, అక్షర, నలంద, బివిఎస్ పాఠశాలలు అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతూ అధిక ధరలకు విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. సిబిఎస్ఇ, ఐఐటి, ఒలంపియాడ్ పేర్లతో విచ్చలవిడిగా ప్రచారాలకు పోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, తక్షణమే విద్యాశాఖ అధికారులు పైపాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రెడ్డయ్య, వెంకటాద్రి, నవీన్, పిడిఎస్‌యు నాయకులు రవి పాల్గొన్నారు.

## 'సజ్జల'పై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలి

### - టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా

**ప్రజాశక్తి - రాయచోటి**

నిబంధనలు పాటించే వాళ్ల కౌటింగ్ ఏజెంట్లుగా తమకు అవసరం లేదన్న సకలశాఖల మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డిపై ఎన్నికల సంఘం తక్షణమే క్రిమినల్ కేసు పెట్టి అరెస్టు చేయాలి అని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, సిఎస్ జవహర్‌రెడ్డి డైరెక్షన్‌లోనే సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. సిఎస్ పదవికి మచ్చ తెచ్చిన జవహర్ రెడ్డిని తక్షణమే పదవి నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు ఓటమి భయంతో పోలింగ్ రోజున విధ్వంసం సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారు అని తెలిపారు. రూల్స్ ఫాలో అయ్యేవాళ్లు తమకు అవసరం లేదని, టిడిపి-జనసేన ఏజెంట్లకు అడుగడుగునా అడ్డం పడాలని సజ్జల హితబోధ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఓటమి భయంతో కుట్రలు, కుతంత్రాలకు తెరలేపారు అన్నారు. ఏజెంట్లను రెచ్చగొట్టేలా మాట్లాడటం ద్వారా 1951, ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సజ్జల ఉల్లంఘించారని అన్నారు. నిబంధనలు పాటించని వైసిపి నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల దగ్గర పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామని తెలిపారు. లేకపోతే అరాచకాలు సృష్టిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు రవీంద్రారెడ్డి, అంజాద్‌బాషా, వెంకటరామిరెడ్డి, బసిరెడ్డి, వెంకటేష్, నాగరాజా, బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖాదర్ బాషా



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

## కౌంటింగ్ విధులు జాగ్రత్తగా నిర్వహించాలి

### - జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

**ప్రజాశక్తి రాయచోటి**

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అప్పగించిన కౌంటింగ్ విధులను చిత్తశుద్ధితో బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్ఒలు, వివిధ శాఖల జిల్లా నోడల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులతో కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా వివిధ అంశాలలో అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, తీసుకోవలసిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాఫీగా పూర్తి చేసేందుకు అధికారులందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. వివిధ అంశా లలో ప్రతి అధికారికి వారు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు కౌం టింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సూపర్వైజర్లు అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, వీరితోపాటు వివిధ విభాగాలలో విధులు నిర్వర్తించాల్సిన అధికారులు సిబ్బంది అందరికీ ఐడి కార్డులు జారీ చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో మీడియా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంటు సెగ్మెంట్ నుంచి రౌండ్ వారి ఫలితాలను ఎప్పటికప్పుడు మీడియా కేంద్రానికి పంపాలని సంబంధిత ఆర్ఒలను ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో కౌంటింగ్ జరుగుతున్న హాలులోకి అనుమతించిన వారు తప్ప ఎవ్వరు మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదని, కట్టుదిట్టంగా అమలు చేయా లని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో ఫుడ్ అరేంజ్మెంట్స్, ఇన్రాస్ట్రక్చర్ పను లను పటిష్టంగా పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలలో, చుట్టుపక్కల ప్రదేశాలలో పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని చెప్పారు. జూన్ 4న ఉదయం ఐదు గంటలకు కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి మూడవ దశ రాండమైజేషన్ చేస్తారని, కావున కౌంటింగ్ సిబ్బంది అందరూ ఉదయం ఐదు గంటలకే కౌంటింగ్ కేంద్రంలో ఉండాలన్నారు. ఆరోజు ఉదయం 6 గంటలకు అబ్జర్వర్లో అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఇవిఎం స్ట్రాంగ్ రూములు తెరుస్తారని, 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, 8:30 గంటలకు ఇవిఎం కౌంటింగ్ మొదలు పెడతారని పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, ఆర్ఒలు రంగస్వామి, హరిప్రసాద్, మోహన్ రావు, రాఘవేంద్ర, లీలారాణి, వివిధ శాఖల జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణ్‌కుమార్‌రెడ్డి

## ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి విజయం తథ్యం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి మరోసారి విజయం సాధిస్తారని ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ కంచి కల్యాణ్ కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని బైపాస్ రోడ్డులో గురువారం పోకనాటివీధి యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని మనం చూస్తామని, ఎన్‌డిఎ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ పేరుతో వదిలిన హామీలను ప్రజలు ఎవరు నమ్మలేదని అన్నారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసేందుకే పింఛన్ ను రూ.3,500లు ఇస్తామని చెప్పారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి లండన్ పర్యటన ముగించుకొని వచ్చి మరల ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తంచేశారు. మహిళలు, వృద్ధులు వైసిపికి అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో రెండవ సచివాలయ కన్వీనర్ వరప్రసాద్, తుమ్మగిండల జనార్ధన్, కంచి శ్రీకాంత్ రెడ్డి, ముజా, బాబా, సాయి పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో 144 సెక్షన్ అమలు

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండలంలో జూన్ 4 వరకు పోలీస్ 30 యాక్ట్ , 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఓటు లెక్కింపులో ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా ఉండేందుకు మండలంలో పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు రాజకీయంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని పోలీసులు కోరారు. ఎన్నికల్లో కౌంటింగ్ రోజున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బాన సంచా పేల్చడం నిషేధమని తెలిపారు. ప్రజలను సహకరించాలని కోరారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న బంకులు

## షార్ట్‌సర్క్యూట్‌తో రెండు బంకులు దహనం

**ప్రజాశక్తి-కలకడ**

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు బంకులు దహనమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రమైన కలకడ సమీపంలో ఉన్న చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండు బంకులు కాలిపోయాయి. ఈ సందర్భంగా బాధితుడు సైపుల్లా మాట్లాడుతూ కెవిమండలం, చీనేపల్లికి చెందిన తాను ఇక్కడ ద్విచక్ర వాహనాలకు సీట్ కవర్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అందులో ఉన్న మోటర్లు సీట్ కవర్లు పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ షాపు పక్కలో ఉన్న మరో బంకుకు నిప్పంటుకొని ఆ బంకు కూడా పూర్తిగా కాలి బూడిదయింది. సుమారు ఒకటిన్న లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.



వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

## రైతులకు వేరుశనగ విత్తన కాయలు

**ప్రజాశక్తి-తంబళ్లపల్లె**

మండలంలో ఖరీఫ్ సాగు చేసుకునేందుకు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తన కాయలను గురువారం పంపిణీ చేశారు. 12 ఆర్.బి.కెల ద్వారా రైతులకు ఈ కార్యక్రమానికి ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సుమారు 1000 క్వింటాళ్ల విత్తన కాయలను ఆర్.బి.కె ద్వారా ఒకేరోజు పంపిణీ చేసినట్లు ఎఒ రమణ కుమార్ తెలిపారు. విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకొని మంచి పంట దిగుబడితో ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.



ఒకే కాన్పులో జన్మించిన సోదరి, సోదరులు

## అపురూపం అందరిలో ప్రత్యేకం

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

కొందరు అదృష్టమంటారు...మరికొందరు వంశపారం పర్యమంటారు.ఏది ఏమైనా ట్రిప్లెట్స్‌గా పుట్టడడం ఓ విభిన్నం.. విచిత్రం. సాధారణం గా ట్రిప్లేట్స్ ఒకరిని పోలి ఒకరుండడం ఒకెత్తయితే,ఒకేలాంటి అభిరు చులు అలవాట్లు కలిగి ఉండడం మరో విశేషం. మండలంలోని కాలువ పల్లెకు చెందిన తేజమూర్తి, చంద్రకళ దంపతులకు 2006, మే 30ను ఒకే కాన్పులో కార్తీక్, కుసుమాంజలి, కళ్యాణ్‌లు ముగ్గురు జన్మించారు. వీరు ముగ్గురు ఇప్పుడు స్థానిక రంగసముద్రం రోడ్డు బి.కొత్తకోట ఆదిత్య డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి కంప్యూ టర్ సైన్స్ చదువుతున్నారు. గురువారం వీరి పుట్టినరోజు వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ప్రిన్సిపాల్ ఎల్.ప్రసాద్, ఇన్‌ఛార్జి రాజేంద్ర, అధ్యాప కులు, తోటి విధ్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

## పెన్షన్ నేరుగా బ్యాంకు ఖాతాలో జమ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

జూన్ నెలకి సంబంధించిన పెన్షన్ నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులకు, 80ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 7,350 మంది పెన్షన్ దారుల్లో 4,836 మంది పెన్షన్ దారులకు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 2,514 మంది పెన్షన్ దారులకు సచివాలయ సిబ్బంది జూన్ ఒకటో తేదీ నుండి 5వ తేదీలోపు వారి ఇంటి వద్దకే వచ్చి ఇస్తారన్నారు. వయోవృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటివద్దకే పింఛన్‌ను అందిస్తామని చెప్పారు. పింఛన్ కోసం ఎవ్వరిని సంప్రదించ వలసిన అవసరం లేదని కమిషనర్ తెలిపారు.

# నాణ్యమైన భోజనాన్ని అందించాలి : ఎంఇఒ



కలకడ: మాట్లాడుతున్న ఎంఇఒ రామచంద్రారెడ్డి



పుల్లంపేట : గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న ఎంఇఒలు

**ప్రజాశక్తి- కలకడ**

విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు వడ్డించాలని ఎంఇఒ రామ చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక మానవ వనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే యేడాదిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం భోజనాలను నాణ్యతతో, రుచికరంగా వడ్డించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో నిరుపేద విద్యార్థులు చదవడం జరుగు తుందని వారికి నాణ్యత కలిగిన భోజనాలను వడ్డించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులు నాగమ్మ ఎంఆర్‌సిలు, మధ్యాహ్నం భోజనం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వంట ఏజెన్సీలకు, ప్రధానోపాధ్యాయులకు ఎంఇఒ నాగ తిరుమలరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుండుపల్లి ఎంఇఒ రవి నాయక్ పాల్గొని పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం భోజనం చేయాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందించని ఏజెన్సీ, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని ఎంఇఒ తెలిపారు. .విద్యార్థుల హాజరు పట్టిక ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని తెలిపారు. రేషన్ షాప్ లో విద్యార్థులకు ఇచ్చే బియ్యం వేరుగా ఉంటాయని అవి మాత్రమే తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం వంటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదా నం చేశారు. ప్రథమ బహుమతిగా అనంతంపల్లి ప్రాథమిక పాఠశాల వంటమనిషి ఆర్.భాగ్య మ్మ, ద్వితీయ బహుమతి వత్తలూరు ప్రాథమిక పాఠశాల వంట మనిషి ఎస్.రమ ణమ్మ, తృతీయ బహుమతి శ్రీరాములుపేట ప్రాథమిక పాఠశాల వంటమనిషి ఎం.పార్వతమ్మలకు ఎంఇఒల చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో ఎస్‌బివిడి సభ హై స్కూల్ ప్రధానో పాధ్యాయులు మురళి, కొత్తపేట హెచ్ఎం కృష్ణమూర్తి, ఎంఐఎస్ శివ, సిఆర్‌పిలు, ఐఇ ఆర్‌టి విజయకుమారి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట ఏజెన్సీ వారు పాల్గొన్నారు.

**బి.కొత్తకోట :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ప్రమాణాలతో కూడిన భోజనాన్ని వడ్డించాలని ప్రధానోపాధ్యాయులు భాస్కర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మధ్యాహ్నభోజన నిర్వహ కులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యంతో సమన్వయంతో ఉండాలని, మధ్యాహ్న భోజన మెనూ తప్పక అమలు పరచాలన్నారు. వంట చేయు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన నిర్వహణకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ నిర్వహకులు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం భాస్కర్



హాజరైన వంట ఏజెన్సీ నిర్వాహకులు

# బిసిజి టీకాతో టిబి అంతం : డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి



వయోవృద్ధులకు బిసిజి టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

**ప్రజాశక్తి-కలకడ**

వయోజన బిసిజి టీకాతో టిబి వ్యాధి అంతం కావడం ఖాయమని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. క్షయ రహిత భారతదేశం లక్ష్య సాధన కొరకే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం పెట్టిందని వైద్యులు యం. వి. కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. మండలం లోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలోని కదిరాయచెరువు పంచాయతీలోని బొంతలవారిపల్లి, ఏనుగొండపాలెం పంచాయతీ దిగువపాలెం, దిగువ తాండ నిర్వహిస్తున్న వయోజన బిసిజి టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీచేసారు. హాజరైన ప్రజలకు టీకాపై ఎంపిహెచ్ఇఒ జయరామయ్య అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా టిబి మరణాల తీవ్రతను నివారించడంలో సురక్షితమైనదని, క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఉపయోగపడుతుందని అన్నారు. 60సంవత్సరాలు పైబడిన వారు, పొగపీల్చువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టిబి జబ్బుతో కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులకు, వీరు టీకాకు అర్హులని అన్నారు. 23న మన కురవపల్లి లోని ఆరోగ్య కేం ద్రంలో టీకాలు వేయడం జరుగుతున్నదని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవ కాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేస్వరరావు, పిహెచ్ఎన్ సుబ్బరత్న, బి. రెడ్డమ్మ, ఎఎన్ ఎంలు, ఎంహెచ్‌పిలు, ఆశ కార్యకర్త ప్రజలు, పాల్గొన్నారు.**రామాపురం :** బిసి సి టీకాతో క్షయ వ్యాధిని నివారించుకోవచ్చని అన్నమయ్య జిల్లా క్షయ వ్యాధి నివారణ కో–ఆర్డినేటర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి సబ్ సెంటర్ పరిధిలోని కర్ణపువాండ్లపల్లి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో 18 సంవ త్సరాలు నిండిన వారిలో బీపీ షుగర్ ఉన్న వ్యాధులు ఉన్నవారికి 60 సంవ త్సరాలు పైబడిన వారికి బీసీజీ టీకా ఇవ్వడం వలన క్షయ వ్యాధి రాకుం డా నివారించవచ్చని అన్నారు. టీకాలను గ్రామాల్లో 60 సంవత్సరాలు నిండిన వారు, 18 సంవత్సరాలు నిండి షుగర్, బిపి ఉన్నవారు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిబి నివారణ సూపర్వైజర్ హరి, ఎంఎల్‌హెచ్‌పి శ్రావణి, ఎఎన్ఎం నాగవేణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.**తంబళ్లపల్లె :** బిసిజి టీకాతోనే టిబి వ్యాధిని నివారించవచ్చని మండల ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ వెంకట్రామయ్య ,డాక్టర్ రిచర్డ్ స్టీఫెన్, డాక్టర్ అమరసింహరాజు, డాక్టర్ విక్రాంత్ రెడ్డి తెలిపారు. గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వయోజనులకు (60 సంవత్సరాల వయస్సు నిండిన వారందరికీ, 18–60 సంవత్సరాల వయస్సు లోపు వున్న వారికి, 5 సంవత్సరాల కిందట టీబీ వ్యాధి వచ్చి తగ్గిన వారికి, షుగర్ వ్యాధి గ్రస్తులకు, పొగ తాగేవారికి, టీబీ వ్యాధిగ్రస్తులతో ఎక్కువ సంబంధాలు వున్నవారికి, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్నవారికి టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. 150 మంది వయోజనులు టిబి టీకా వేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిబి సూపర్వైజర్స్ రామకృష్ణ, భూపతి పాల్గొన్నారు.



రామాపురం : వృద్ధుడికి టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

# రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్



మాన్ అఫ్ ది మ్యాచ్ అందుకుంటున్న కరణ్

**ప్రజాశక్తి-నందలూరు**

నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్‌లో భాగంగా నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటు రసవత్తరంగా కొనసాగుతోంది. గురువారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో గాంధీనగర్ లెవన్స్ అరవపల్లెజట్టు, వినాయక లెవెన్స్ నాగిరెడ్డిపల్లె జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గాంధీ నగర్ జట్టు 14 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 171 పరుగులకు చేసింది. పాల్ రాజ్ 45, ఎమ్మెస్ మనీ 34 పరుగులు చేశారు. అనంతరం విజయం కోసం బరిలో దిగిన వినాయక జట్టు 9.4 ఓవర్లలో 72 పరుగులకు ఆల్ అవుట్ అయి పరాజయం చెందింది. గాంధీనగర్ జట్టు బౌలర్ కరణ్ 4 ఓవర్లు వేసి 17 రన్లు ఇచ్చి ఆరు వికెట్లు తీసి, విజయంలో కీలక పాత్ర పోషించి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు రంగస్వామి చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నారు.

**రాజంపేటపై మంటపంపల్లె విజయం**

మధ్యాహ్నం ముద్దు కృష్ణ లెవెన్స్ మంటపం పల్లె, రాజంపేట యాసీన్ లెవెన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన ముద్దు కృష్ణ జట్టు 14 ఓవర్లలో 157 పరుగులకు 6 వికెట్లను కోల్పోయింది. ప్రవీణ్ 36 బంతుల్లో 68 పరుగులు చేశాడు. అనంతరం 158 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన యాసిన్ జట్టు 13.1 ఓవర్లలో 77 పరు గులు చేసి అన్ని వికెట్లను కోల్పోయి పరాజయం చెందింది. రెండు ఓవర్లు వేసి 2 వికెట్లు తీయడంతోపాటు, 68 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రవీణ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందించారు. ఈ మ్యాచ్‌కు జాతీయ వికలాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి, క్రికెట్ క్రీడాకారుడు చందు అంపేర్లుగా, అప్సర్, దినేష్ లు స్కోరర్ గా వ్యవహరిం చారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, రంజిత్ క్రీడాకారులు క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పారదర్శకంగా వేరుశనగ విత్తన పంపిణీ : జెడి

**ప్రజాశక్తి-పెద్దమండ్యం**

పారదృకంగా వేరుశనగ విత్తన కాయల పంపినీ కార్యక్రమాన్ని చేపడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెలిగల్లు ఆర్‌బికె కేంద్రంలో వేరుశనగ విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన పంపిణీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అయన మాట్లాడు పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులు స్థానిక ఆర్‌బికెలో పేరు నమోదు చేసుకొని రాయితీ వేరుశెనగ విత్తన కాయలు తీసుకోవచ్చుని ఆయన తెలిపారు. విత్తన కాయలను సాగుచేసుకొని ఇక్రాప్ చేసుకోవాలని, ఇ క్రాప్ చేసుకొన్నవారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. ఒకవేళ వేరుశెనగ కాయలు నాణ్యత లేకపోతే ఆర్‌బికె కేంద్రంలో వెనక్కి ఇచ్చి మరల నాణ్యమైన కాయలు పొందవచ్చని చెప్పారు. రైతులు విత్తన కాయలను సద్వినియోగం చేసుకొని లాభాలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ఎడిఎ వాణిశ్రీ, వెలిగల్లు ఆర్‌బికె అసిస్టెంట్ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



ఆర్‌బికెలో రికార్డులను పరిశీలిస్తున్న జెడి చంద్రనాయక్

## యోగాపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - చాపాడు**

స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా హాజరైన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో యోగాపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ విద్యార్థులు యోగా, వ్యాయామం, ఆసనాలు వేయాలన్నారు. తద్వారా చురుకుదనంగా ఉంటారన్నారు. ఆరోగ్యంగా కూడా ఉండవచ్చని సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా అన్ని రకాల అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకో వాలన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ డిఎస్‌పి మోహన్‌రావు

## ఇసి ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి-కలకడ**

ఇసి ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాయచోటి స్పెషల్ డిఎస్‌పి మోహన్ రావు పేర్కొన్నారు.గురువారం మండల కేంద్రమైన కలకడ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 4న జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ఎవ్వరూ అల్లర్లకు పాల్పడకూడదని సూచించారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జయ అపజయాలు సాధారణంగా ఉంటాయని, విజయం సాధించిన వారు ర్యాలీలు, బాణసంచా పేల్చడం చేయకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసు కోవడం జరుగుతుందని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



సబ్సిడీ సిలిండర్లను సీజ్ చేస్తున్న అధికారులు

## సబ్సిడీ సిలిండర్ల అక్రమ వినియోగంపై కొరడా

**- ప్రజాశక్తి వార్తకు స్పందన**

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

'ఇష్టారాజ్యంగా సబ్సిడీ సిలిండర్లు' అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది.గురువారం 22 సబ్సిడీ సిలిండర్లు సీజ్ చేసి జరిమానా విధించినట్లు సిఎస్‌డిటి తెలిపారు. మండల విఆర్‌ఒలతో కలిసి హోటళ్లు, టీ దుకాణాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మంజూరు చేసిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వ్యాపారస్తులు వినియోగించడం చట్ట విరుద్ధమని అన్నారు. ఈ అంశంపై గతంలో అటు వ్యాపారులు, ఇటు ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. సిలిండర్లు సరఫరా చేసేవారు సబ్సిడీ సిలిండర్లను వినియోగదారులకు మాత్రమే అందజేయాలని లేనియెడల వారి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో విఆర్‌ఒలు అమర్ నారాయణ, హైదర్, అశోక్ నాయక్ పాల్గొన్నారు.

## పైడిపాలెం రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్ నుంచి నీటిని హిమకుంట్ల కాలువకు విడుదల చేసినట్లు జికెఎల్ఐ డిఇ శ్రీనివాస్ తెలిపారు. గురువారం డ్యామ్ నుంచి నీటిని విడుదల చేశామన్నారు. అరటి, చీనీ రైతుల అవసరాల దృష్ట్యా ప్రతిరోజు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామన్నారు. రిజర్వాయర్ సామర్థ్యం ఆరు టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.87 టీఎంసీల నీరు ఉందన్నారు. అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని వినియో గిస్తున్నామన్నారు.

## గండి క్షేత్రంలో హోమాలు

**ప్రజాశక్తి - చక్రాయపేట**

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం వేద పారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారా తోరణం, అగ్ని ప్రతిష్ఠ, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి దంపతులు హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కావలి క్రిష్ణతేజ, సభ్యుడు బిందుసాగర్, వేద పారాయణదాం రామమోహన్ శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## ఫొటోలు చూపించి వేధింపులకు గురిచేస్తున్నాడు

**- పోలీసులకు ఓ వివాహిత ఫిర్యాదు**

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

గతంలో తీసుకున్న ఫోటోలు చూపించి విశ్వనాథ అనే వ్యక్తి తనను వేధింపులకు గురి చేస్తున్నాడని జ్యోతి, ఆమె భర్త శేఖర్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కోటవూరు పంచాయతీ,చౌటకుంటపల్లికి చెందిన జ్యోతి వివాహానికి ముందు అదే గ్రామనికి చెందిన విశ్వనాథ అనే వ్యక్తితో సన్నిహితంగా ఉండేదని చెప్పారు. అప్పుడు వారిద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలు చూపించి వేదింపులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారని తెలిపారు. తర్వాత విషయం తన భర్త శేఖర్‌కు తెలిసి మందలించినట్లు చెప్పారు. విశ్వనాథ తన ఫోటోలు ఉంచుకొని వేదింపులకు గురిచేస్తూ తమ వివాహ బంధానికి భంగం కలిగే ప్రవర్తిస్తున్నారని తన భర్త శేఖర్‌తో కలిసి ఫిర్యాదు చేశారని చెప్పారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సూర్యనారాయణ తెలిపారు.

## అత్యాచార నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు

**ప్రజాశక్తి - బి.కొత్తకోట**

బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్.సూర్యనారాయణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పిటిఎం మండలం, మల్లెల గ్రామనికి చెందిన ఆంజనేయులు(34) అనే వ్యక్తి గ్రామంలోని ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడని చెప్పారు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. వయసులో ఉన్న యువతుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ మధ్యకాలంలో అమ్మాయిలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని, ఎవరైనా బాలికలు, యువతులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తమ దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు